పుణ్యక్షేత్రాలకు వెళ్లి.. విగతాజీవిగా వచ్చి..

- అస్వస్థతకు గురైన యువకుడు
- దవాఖానలో చికిత్స పొందుతూ మృతి
- కొత్తదాంరాజ్‌పల్లి గ్రామంలో విషాదం

చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

మల్లాపూర్, ఫిబ్రవరి 24: తోటి మిత్రులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లిన ఆ యువకుడు అస్వస్థతకు గురయ్యాడు. నాలుగురోజుల పాటు దవాఖానలో చికిత్స పొందగా, పరిస్థితి విషమించి మృతి చెందడంతో కొత్తదాంరాజ్‌పల్లిలో విషాదం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మల్లాపూర్ మండలం కొత్తదాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బద్ధం చంద్రశేఖర్‌రెడ్డి(29) ఈ నెల 17న కొంత మంది స్నేహితులతో కలిసి ఓ వాహనంలో కుంభమేళ, కాశీ, అయోధ్య పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో కుంభమేళలో పుణ్యస్నానం అనంతరం 20న కాశీకి వెళ్లి దర్శనం చేసుకున్నారు. తిరిగి కాలినడకన వస్తుండగా చంద్రశేఖర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై సృహ తప్పి కిందపడిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు వెంటనే అక్కడ ఉన్న ఓ దవాఖానలో చేర్పించారు. నాలుగు రోజులకు పైగా దవాఖానలో చికిత్స పొందినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాల, ఫిబ్రవరి 24: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోల జిల్లా సంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం పలు సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలువగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాస్‌రావు, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణను సన్మానించారు. ఇక్కడ టీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, టీఎన్‌జీల జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరు రవిబాబు, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్‌కుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కేంద్ర సంఘం నేతలు రాగి శ్రీనివాస్, ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, టీజీవో జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, పెన్షనర్ల జిల్లా సహా అధ్యక్షుడు పీ హన్మంత్‌రెడ్డి, టీఎన్‌జీవో, టీజీవో నేతలు మహమూద్, సాహేద్‌బాబు, గణేశ్, విజేందర్, అశోక్‌రాజు, రాజేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, రవిచంద్ర, రవీందర్, వేణు, మమత, శైలజ, శ్రావణి, ఉమేశ్వరి, శైని మాత్యు, భాగ్య, అరుణ, మధుకర్, శ్రీనివాస్ స్వామి, హరిప్రసాద్, సంపత్, రాంకిషన్‌రావు, సంతోష్, ప్రదీప్, అసద్, హరిప్రసాద్, మోహన్, ముజాహిద్ ఖాన్, మెట్టుదాస్, సత్యనారాయణ, రవీందర్, కిరణ్, మహేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూ

పెగడపల్లి, ఫిబ్రవరి 24: రుణాల మంజూరు కోసం సోమవారం మండల పరిషత్‌లో దివ్యాంగులకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఎకానమిక్ రిహాబిలిటేషన్ పథకం (ఈ ఆర్ఎస్) ₹50వేల యూనిట్ మంజూరు కాగా, 31మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 27మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇక్కడ సెర్ప్ మండల ఏపీ ఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బ్యాగ్ అందజేత

మల్యాల (కొడిమ్యాల), ఫిబ్రవరి 24: కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని సోమవారం జిల్లాలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడ్డం లత దర్శించుకున్నది. ఈ క్రమంలో ఆలయప పరిసరాల్లో తన హ్యాండ్‌బ్యాగ్ పోగొట్టుకున్నది. గమనించిన ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది మురళి, మధు మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేశారు. లత అక్కడికి చేరుకోగా ఆమెకు బ్యాగ్‌లోని ₹4,371నగదు, ఆధార్‌కార్డు అందజేశారు.

పోలింగ్‌పై అవగాహన ఉండాలి

- పారపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి
- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- పీవోలు, ఏపీవోలకు ప్రత్యేక శిక్షణ

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

సమావేశంలో పాల్గొన్న అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 24: మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగిఉండాలని.. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడుత శిక్షణ ఇవ్వగా.. అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే, శాసనమండలి పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుసక్రమంలో టోకెన్ నంబర్లు అందించి వారితో ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే 26న ఉద యం ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ బాధ్యతగా విధు లు నిర్వర్తించాలని సూచించారు. పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సాధారణ సెలవు

పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ సత్యప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని ఆయన చెప్పారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పని చేస్తున్న గ్రాడ్యుయేట్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి ప్రచారం నిషేధం

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో నేటి (మంగళవారం) సాయంత్రం 4గంటల నుంచి ఈ నెల 27సాయంత్రం 4గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, రాజకీయపరమైన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడం నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ సత్యప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టంచేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జిల్లో విస్తృతంగా తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసేవరకు జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని వెల్లడించారు.

మద్యం షాపులు బంద్

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4నుంచి 27సాయంత్రం 4 గంటల వర కు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్ రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, చీప్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు అందరూ సహకరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

- 'నమస్తే' కథనానికి స్పందన

కొడిమ్యాల, ఫిబ్రవరి 24: మండలంలో 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారంపేటలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, అందుకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అధికారులు పట్టుకున్నారు. అదేవిధంగా సందాల్లపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పరిశీలించారు. డంప్‌చేసిన ఇసుకను ఏఏ గ్రామాలకు తరలిస్తున్నారో ఆరాతీశారు. అక్రమంగా ఇసుకను రవాణా చేసినా, నిల్వ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, పోలీస్ సిబ్బంది అరిసె రాజు, తిరుమలేశ్, మైనింగ్‌శాఖ అధికారులు తిరుమలరావు, సుదర్శన్, తదితరులు ఉన్నారు. కాగా, మండల కేంద్రంలో ఓ రైతుకు ఏడాదికి ₹3.70లక్షలు, సంద్రల్లపల్లిలో ఓ సంఘానికి ₹లక్షా70వేలు చెల్లించి వారి భూమిలో నుంచి ఇసుకను తరలిస్తునట్లు తెలుస్తున్నది.

ఆరోగ్యం-పౌష్టికాహారంపై శిక్షణ

జగిత్యాల రూరల్: అవగాహన కల్పిస్తున్న జిల్లా సెర్ప్ ఫామ్ డీపీఎం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 24: జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో మహిళా గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు, సబ్ కమిటీ సభ్యులకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యం, వివిధ కూరగాయలు, ఆహార పదార్థాలపై జిల్లా సెర్ప్ ఫామ్ డీపీ ఎం సుదం వెంకటేష్ అవగాహన కల్పించారు. ఇక్కడ కల్లెడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ఏపీఎం గంగాధర్, ఏఎన్ఎం లు శైల, శైలజ, సీసీలు గంగా రాం, శ్రీనివాస్, రవీందర్, విద్యాసాగర్, సమాఖ్య అధ్యక్షులు సత్త వ్వ, గంగజల, కార్యదర్శులు భారతి, జమున, కోశాధికారులు శ్రీలత, సుమలత, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్, ఫిబ్రవరి 24: బీర్‌పూర్ మండలంలోని సెర్ప్ కార్యాలయంలో జాగృతి మహిళా మండల సమైఖ్య ఆధ్వర్యంలో మహిళా గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై శిక్షణ ఇచ్చారు. ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎంపీడీవో లచ్చాలు, తహసీల్దార్ ముంతాజొద్దీన్, డీటీ శ్రీనివాస్, డీపీఎం మల్లేశం, ఐసీడీఎస్ సుపర్‌వైజర్, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, తదితరులు ఉన్నారు.

కథలాపూర్, ఫిబ్రవరి 24: మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం-ఆరోగ్యంపై మహిళా సంఘాల ప్రతినిధులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని మహిళలకు సూచించారు. ఇక్కడ ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి సింధూజ, ఏపీఎం నరహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదీబేగం, సీసీలు అంజయ్య, రాజేందర్, అశోక్, తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నలుగురికి జైలు

కథలాపూర్, ఫిబ్రవరి 24: ఇప్పపెల్లి గ్రామంలో ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ చేసిన కేసులో నలుగురికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ కోరుట్ల న్యాయమూర్తి పావని సోమవారం తీర్పునిచ్చారని కథలాపూర్ పోలీసులు తెలిపారు. గతేడాది జూలై 9న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సురేశ్, గంగప్రసాద్, ఎస్‌కే ఆసీఫ్, డిచ్‌పల్లికి చెందిన ఎస్‌కే ఖదీర్ ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనానికి పాల్పడగా, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నలుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన ఒకరిపై..

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: బడి నుంచి ఇంటికి వస్తున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 20రోజుల జైలుశిక్షతో పాటు ₹26వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ధర్మపురికి చెందిన ఒడ్డేటి చంద్రతేజ 2021లో జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి పాఠశాల నుంచి వెళ్తున్న ఇద్దరు పదేండ్లలోపు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికల తండ్రి జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపిన పోలీసులు చంద్రతేజ్‌పై కేసు నమోదు చేశారు. జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి.. నిందితుడు చంద్రతేజకు 20 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మద్యంతాగి వాహనం నడిపినందుకు..

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24: మేడిపల్లి క్రాసింగ్ వద్ద ఈ నెల 11న వాహనాల తనిఖీలు చేస్తుండగా, మండల కేంద్రానికి చెందిన గూడ సురేశ్ మద్యం తాగివాహనం నడపడంతో కోర్టుకు తరలించామని ఎస్ఐ అనిల్ తెలిపారు. న్యాయమూర్తి అరుణ్‌కుమార్ సురేశ్‌కు నాలుగురోజులు జైలుశిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి

ఫెసిలిటాషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 24: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ పేర్కొన్నారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే ఫైనాన్షియల్ లిటరసీ-ఉమెన్స్ ప్రాస్పారిటీ (ఆర్థిక అక్షరాస్యత-మహిళల ఆర్థిక సమృద్ధి) అనే అంశంపై నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ మధుసూదన్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అపరిచితుల నుంచి వచ్చిన ఫోన్లకు ఎవరూ స్పందించవద్దని, తమ వ్యక్తిగత, బ్యాంక్ ఖాతాల వివరాలు చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాలను నివారించడానికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ తెలిపారు.

ఫెసిలిటాషన్ సెంటర్ పరిశీలన

సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటాషన్ సెంటర్‌లో పలువురు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సెంటర్‌ను కలెక్టర్ బీ సత్యప్రసాద్ సోమవారం సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గత రెండు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా 127మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 24: జోగన్‌పల్లి గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలో వివిధ కాలనీల్లోని మురుగు కాలువలను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించి చెత్తాచెదారాన్ని డంప్‌యార్డుకు తరలించారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిపోడి చెత్తను పారిశుధ్య సిబ్బందికి వేర్వేరుగా అందించాలన్నారు. ఇక్కడ కార్యదర్శి హకీం, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వేడుకలకు ముస్తాబైన ఆలయం

సారంగాపూర్, ఫిబ్రవరి 24: ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 25న రాత్రి స్వామి వారి కల్యాణం, 26న రాత్రి 12గంటలకు నిషి పూజ, రుద్రాభిషేకం, జాగరణ, 27న పారణ, అన్నపూజ, 28న ఉదయం 10:30కు స్వామివారి రథోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో అనూష, ట్రస్ట్ పౌండర్ పొరండ్ల శంకరయ్య తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలుగనివ్వం

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

సారంగాపూర్, ఫిబ్రవరి 24: మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ దుబ్బ రాజేశ్వరస్వామివారి సన్నిధికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంబట్ల, కోనాపూర్‌లోని శ్రీదుబ్బ రాజేశ్వరస్వామి ఆలయాల్లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఆలయ ఈవో వడ్లకొండ అనూష, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 24నుంచి 28వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ పౌండర్ పొరండ్ల శంకరయ్య, ఎస్ఐ దత్తాద్రి, జూనియర్ అసిస్టెంట్లు రజినీకాంత్, లక్ష్మీరాజం, వెంకటేష్ పాల్గొన్నారు.

డాబాపై నిద్రిస్తే.. ఇల్లు లూటీ

- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతానికి చెందిన గుండేటి రాజశేఖర్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి డాబాపై పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున రాజశేఖర్ కిందికి వచ్చి చూడగా, ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువా తెరిచిఉండడం, సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే జగిత్యాల టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ సేకరించి చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

డిక్షనరీలతో విద్యార్థులు

కోరుట్ల, ఫిబ్రవరి 24: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మెకిన్ ఇండియా పిలుపు మేరకు విద్యార్థులకు స్వయం ఉపాధిలో సాంకేతిక పరిజ్ఞాన జోడించాలనే ఉద్దేశంతో ఎల్ ఈడీ బల్బుల తయారీ, ఎల్ఈడీ లైట్స్ జోడించి ఇంట్లో వాడుకునే వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. సుమారు వంద బల్బులను తయారు చేశారు. ఇంగ్లిష్ టీచర్ అరుణ విద్యార్థులకు సుమారు రూ.10వేల విలువైన డిక్షనరీలను ఉచితంగా అందించారు. ఇక్కడ హెచ్ఎం సీహెచ్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, చంద నాగరాజు, గంగమోహన్, లక్ష్మి, రవూఫ్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీలో కోళ్ల వ్యర్థాలు

కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన

కొడిమ్యాల, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని రామకిష్టాపూర్ వెళ్లే దారిలో శివాజీ చౌక్ ఆవరణలో గల పెద్ద కాలువలో ప్రతిరోజూ చికెన్ సెంటర్ నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో సమీప కాలనీలు కంపుకొడుతున్నాయి. నిత్యం మండల కేంద్రానికి వచ్చి ప్రజలు, స్థానికులు చికెన్ వ్యర్థాలతో వచ్చే వాసనతో ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, స్పందించలేదు.

జగిత్యాల జిల్లా ధర్మపురికి కేటాయించిన నవోదయ విద్యాలయాన్ని ధర్మపురిలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన పట్టభద్రుల బహిరంగ సభలో ధర్మపురి వాసులు ప్లకార్డులు ప్రదర్శించారు.

అన్నను చంపిన చెల్లెళ్ల అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ఆస్తి తగాదాలతో అన్నను చంపిన ఇద్దరు చెల్లెళ్లను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణం పోచమ్మవాడకు చెందిన జంగిలి శ్రీనివాస్, అతడి చెల్లెళ్లు భారతపు వరలక్ష్మి, వొడ్నాల శారదకు ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జంగిలి శ్రీనివాస్‌ను అతడి చెల్లెళ్లు వరలక్ష్మి, శారద ఆదివారం కర్రతో తలపై బాది పిడిగుద్దులు గుద్ది హత్య చేశారు. శ్రీనివాస్ భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు వరలక్ష్మి, శారదను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో కే రాము

జగిత్యాల, ఫిబ్రవరి 24: జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈవో కే రాము అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రామన్నపేట(సి), తాటిపల్లి గురుకుల బాలికల పాఠశాల, గొల్లపల్లిలోని మోడల్‌స్కూల్, ఉన్నత పాఠశాల, బాలుర, బాలికల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో వసతులు కల్పించాలని హెచ్ఎంలకు సూచించారు. ఇక్కడ కోఆర్డినేటర్ రాజేశ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్రీన్ డే వేడుకలు